క్లుప్తంగా

రేపు కేంద్ర బృందం పర్యటన

మానవపాడు:మండలంలోని బోరవెల్లి గ్రామంలో ఈ నెల 19న కేంద్ర బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. గురువారం బోరవెల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో 20 గ్రామాల్లో బృందం పర్యటించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టాలి



మానవపాడు: విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మండంలోని అమరవాయి పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. పాఠశాలకు రాని విద్యార్థుల వివరాలపై ఆరా తీయాలన్నారు. సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టాక్, అడ్మిషన్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు రాజశేఖర్, వెంటకరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

రాజోళి: శాంతిగనర్ పట్టణంలో నిత్యం విద్యుత్ కోతలతో నానా అవస్థలు పడుతున్నట్లు పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడో పోతుందోనని వాపోతున్నారు. మరమ్మతు పనులు చేపడుతున్నామని విద్యుత్ అధికారులు రోజులు ఏడెనిమిది సార్లు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారన్నారు.ముఖ్యంగా రాత్రుళ్లు కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, అధికారులు స్పందించి విద్యుత్ కోతల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

రేపటి నుంచి సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి వారం రోజుల పాటు సప్తాహ భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సత్య చంద్రారెడ్డి, చైర్మన్ ప్రహ్లాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

చీరలే పంటకు రక్షణ కవచాలు



ఇటిక్యాల: పంట పొలాలకు చీరలే రక్షణ కవచాలయ్యాయి. కష్టపడి పండించిన పంటను వన్యప్రాణుల నుంచి రక్షించుకునేందుకు మండలంలోని మునుగాల శివారులో పొలం చుట్టూ రక్షణగా చీరలు ఏర్పాటు చేశారు. చీరల పరదాలను చూసి కోతులు, అడవి పందులు, జింకలు, వంటి వన్యప్రాణులు పంట పొలాల దరి చేరవని రైతులు పేర్కొంటున్నారు.

ఏఐసీసీ కార్యదర్శికి సన్మానం



ఎర్రవల్లి: మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్తుండగా పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ నాయకులతో కలిసి కూడలిలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు జోగులరవి, కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, రాజ్‌కుమార్, సోమిరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీరాములు, తిరుపతయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరు బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ వీరన్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇర్కిచేడులో జన సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌బీవై తదితర ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ రూ.2 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌టీ కౌన్సిలర్లు అనూష, ప్రకాష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మినీ స్టేడియం

- రూ.2.10కోట్ల వ్యయంతో నిర్మాణం
- శిథిలావస్థకు చేరుతున్న భవనం
- శాట్స్ చైర్మన్ సందర్శించినా మారని రూపురేఖలు



ఎర్రవల్లిలో నిరుపయోగంగా ఉన్న మినీ స్టేడియం

ఎర్రవల్లి: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయడం కోసం మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యం అధికారులు, ప్రజాప్రతినిధుల పరిశీలన, నిర్వహణ లోపం కారణంగా క్షేత్రస్థాయిలో విఫలమయ్యింది. క్రీడలకు అవసరమైన వసతులు లేకపోవడంతో పాటు నిర్వహణ లోపం కారణంగా స్టేడియం భవనం శిథిలావస్థకు చేరింది. క్రీడా మైదానానికి వెళ్లే మార్గం కూడా చిట్టడివిని తలపిస్తుందని గ్రామీణ క్రీడాకారులు వాపోతున్నారు.

కోట్ల ప్రజాధనం వృథా

మండల కేంద్రానికి కూత వేటు దూరంలో 2014లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2,10 కోట్ల వ్యయంతో ఐదెకరాల విస్తీర్ణంలో మినీ స్టేడియాన్ని నిర్మించింది. కానీ నాటి నుంచి నేటి వరకు తెరిచిన పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేక పోవడంతో రూ. కోట్ల ప్రజాధనం వృథాగా అయిపోయింది.

అధికారుల నిర్లక్ష్యం

44వ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు సౌకర్యంగా ఉంటుంది. కానీ నిర్వహణ లోపం అధికారులు నిర్లక్ష్యం కారణంగా స్టేడియం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గదుల తలుపులు విరిగిపోయి, కిటికీల అద్దాలు పగిలిపోయి ఉండటంతో పాడుబడిన బంగ్లాలా దర్శనమిస్తుంది. మైదానంలో కోకో, వాలీబాల్, ఫుట్‌బాల్, షెటిల్ వంటి కోర్టుల్లో ఏర్పాటు చేసిన ఐరన్ పోల్స్, క్రీడా పరికరాలు, సామగ్రి తుప్పుపట్టి విరిగిపోతున్నాయి.

ఆరేళ్లు ఆవాస పాఠశాలకు

గతంలో అధికారులు క్రీడా మైదానాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు సాధ్యం కాకపోవడంతో భవనంలో 2017 నుంచి 2023 వరకు ఆవాస పాఠశాల నిర్వహించారు. దాదాపు రెండు వందల మంది విద్యార్థులు అక్కడే విద్యను అభ్యసించారు. 2023లో ఆవాస పాఠశాలను గద్వాలకు మార్చడంతో స్టేడియం గతం కంటే మరింత అధ్వాన్న స్థితికి చేరుకుంది.

శాట్స్ చైర్మన్ సందర్శించినా మారని తీరు

పుట్టెడు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మినీ స్టేడియాన్ని పలుమార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ఇటీవలే రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సందర్శించారు. అక్కడి పరిస్థితులు, రోడ్డు, క్రీడా మైదానాన్ని పరిశీలించి అక్కడి సమస్యల గురించి స్థానిక అధికారులను, క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మినీ స్టేడియాన్ని పునరుద్ధరించి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని హామీ కూడా ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు మినీ స్టేడియం క్రీడాకారులకు నిరుపయోగంగానే మిగిలిపోయింది.



కిటికీలకు పగిలిపోయిన అద్దాలు



అడవిని తలపిస్తున్న మినీ స్టేడియానికి వెళ్లే మార్గం

వినియోగంలోకి తేవాలి



స్టేడియం నిర్మాణం నుంచి అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపంతో పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియంలో మౌలిక వసతులను కల్పించి యువతకు క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– కృష్ణసాగర్, క్రీడాకారుడు, ఎర్రవల్లి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



మినీ స్టేడియంలో వసతులు లేకపోవడం వల్ల మైదానంలో క్రీడలను నిర్వహించడం చాలా ఇబ్బందిగా మారింది. మినీ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా అధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి కూడా పలుమార్లు తీసుకెళ్లాం. ప్రభుత్వం స్పందించి అన్ని వసతులు కల్పించాలి

– జోగుల రవి, మాజీ సర్పంచ్, ఎర్రవల్లి

సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యం

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కేవలం పీఆర్టీయూతోనే సాధ్యమవుతుందన్నారు. మండలంలో 100 మందికి పీఆర్టీయూ సభ్యత్వాన్ని తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ షలం, జిల్లా సంఘం బాధ్యులులు లక్ష్మన్న, మహ్మద్ రియాజ్‌బాషా, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరిప్రసాద్, శ్రీనివాసులు, నాగేంద్రం, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న పీఆర్టీయూ నాయకులు

19న మందకృష్ణ మాదిగ రాక

గద్వాలటౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఈ నెల 19న గద్వాలలో జరిగే సమావేశానికి హాజరవనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ తెలిపారు. గురువారం జరిగిన జిల్లా ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ పోరాడుతున్నారన్నారు. దివ్యాంగులు, చేయూత ఫించన్లను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పాల్గొనే సమావేశానికి అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అశోక్, పరశురాం, కన్నా, మోష, ఆంజనేయులు, భాస్కర్, యల్లప్ప, యాగంటి, వెంకటన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు

మహిళా శక్తి సంబరాలు జయప్రదం చేయాలి

గట్టు: మహిళా శక్తి సంబరాలు జయప్రదం చేయాలని డీఆర్డీఏ అడిషనల్ పీడీ శ్రీనివాసులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 19న నిర్వహించే మహిళా శక్తి సంబరాలను ఏర్పాట్లపై సమీక్షించారు. మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహిద్దామని, అన్ని సంఘాల మహిళలు పాల్గొనేలా చూడాలన్నారు. సభకు పెద్ద ఎత్తున మహిళల సమీకరణ చేయాలని ఐకేపీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎం ఎల్లప్ప, ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు శివకుమార్, దేవదాసు, సుదర్శన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఐకేపీ అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాసులు

జీవనోపాధిని మెరుగుపర్చాలి

గట్టు: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు జీవనోపాధిలను బలోపేతం చేయాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. గురువారం తుమ్మలచెరువు గ్రామంలో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ సహకారంతో పాతబడిన పంచాయతీ భవనాన్ని పునః నిర్మించి ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ (సీఎస్‌ఆర్‌సీ)ను ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. సీఎస్‌ఆర్‌సీ ముఖ్య ఉద్దేశం గ్రామస్తుల సాధికారత, జీవనోపాధిని బలోపేతం చేయడమే అన్నారు. భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ సంస్థ గట్టు మండలాన్ని దత్తత తీసుకుని అనేక అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. సంస్థ సహకారంతోనే నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా 2024– 25 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా గట్టు మండలం 5వ స్థానం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. జీవనోపాధుల అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, ఎంపీయూపీఎస్ హెచ్‌ఎం, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ అమరేష, అక్బర్‌పాషా, పీఎస్‌ఓ మునిస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య

20న బహిరంగ వేలం

అలంపూర్: పట్టణంలోని జోగుళాంబ దేవి ఎత్తిపోతల పథకం నిర్వహణ చేపట్టేందుకు ఈ నెల 20న రైతు సంఘం నందు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయకట్టుదారుల సంఘం సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎత్తిపోతల పథకం నిర్వహణ చేపట్టాలని, మొత్తం 3,230 ఎకరాల పంట పొలాలకు నీరు పారించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.2 లక్షల చెక్కు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ

గద్వాల: అత్యంత వెనకబడిన తరగతుల సంస్థ ఆధ్వర్యంలో యువతీ యువకులకు వివిధ అంశాలపై నైపుణ్యాలను పెంపొందించటానికి హైదరాబాదులో శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ తరగతుల అభివృద్ధి అధికారి నుషిత ఓ ప్రకటనలో తెలిపారు. వెనకబడిన తరగతి యువతీ, యువలకు స్టాఫ్‌స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్స్, మాక్ ఇంటర్వ్యూలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్, మెంటల్ వెల్ బీయింగ్ ట్రైనింగ్ తదితర అంశాలపై శిక్షణ నైపుణ్యతను పెంపొందించటానికి శిక్షణ ఇవ్వడనున్నట్లు తెలిపారు. వెనకబడిన తరగతుల 36కులాల అభ్యర్థులకు ఏదేని డిగ్రీ పాస్ అయి 21నుంచి30 సంవత్సరాల వయసు గల వారు ఆధార్‌కార్డుల, కులధ్రువీకరణ పత్రాలతో ఈనెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ gobmmr.cff.gov.in ద్వారా సమర్పించాలని తెలిపారు. ట్రావెలింగ్ అలవెన్స్, భోజన సదుపాయం కల్పించబడుతుందని, నిరుద్యోగ యువతీ యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

గద్వాల: మైనార్టీ వర్గానికి చెందిన యువతకు బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్ సెక్టార్‌లో నెలపాటు ఉచిత శిక్షణ హైదరాబాదులో అందించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నుషిత ప్రకటనలో తెలిపారు. అర్హత గల మైనార్టీ వర్గానికి అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 18 నుంచి ఆగస్టు 18లోగా చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఏదేని గుర్తింపు పొందిన గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో 50శాతం ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. 26 ఏళ్ల లోపు వయసు కలిగి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలని, పూర్తి వివరాలకు 040–23236112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

అయిజ: ధరూర్ మండలంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా శుక్ర, శనివారాల్లో మున్సిపాలిటీ, మండలంలో నీటి సరఫరా నిలిపివేస్తునట్లు వాటర్ గ్రిడ్ డీఈఈ వెంకటరమణ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ మరమ్మతు అనంతరం సోమవారం నుంచి నీటి సరఫరా యథావిధిగా పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.

పత్తిపంట వాడుముఖం

అయిజ: వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుచేసిన పత్తి పంటలు దెబ్బతింటుంది. బోరు బావుల్లో భూగర్భ జలాలు తక్కువవడంతో మొక్కలు వాడుముఖం పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు వానలు పడి పంటసాగు చేస్తే వర్షాలు ముఖం చాటేయడంతో అవస్థలు పడుతున్నట్లు పేర్కొంటున్నారు.



సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

గద్వాల క్రైం: సీజనల్ వ్యాధులు విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని రాష్ట్ర సీజనల్ వ్యాధుల పర్యవేక్షణాధికారి సుధాకర్‌లాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గద్వాల– అలంపూర్ సెగ్మెంట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జ్వరం, టైఫాయిడ్, డెంగీ, మలేరియా తదితర వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కింది స్థాయి సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందజేయాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రిల్లో వైద్య సేవలు అందేల ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లోని నమోదైన వ్యాధుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్దప్ప, సంధ్యాకిరణ్మయి, రిజ్వానా, ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజనల్ పర్యవేక్షణ అధికారి సుధాకర్‌లాల్

ఉద్యాన పంటల సాగు లక్ష్యాలను సాధించాలి

గద్వాల: జిల్లాలో ఉద్యావన పంటల సాగువిస్తరణ లక్ష్యాలను సాధించి, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్‌హాలులో అధికారులతో సమీక్షించారు. ఆయిల్‌పామ్ తోటల పెంపక విస్తీర్ణం పెంచాలని, ఈమేరకు అవగాహన కల్పించాలని సబ్సిడీలు, అంతరపంటల ఆదాయం డ్రిప్ రాయితీలు తదితర వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. విజయవంతమైన రైతులను రోల్‌మోడల్‌గా చూపించి బ్యాంకులు, ఉపాధిహామీ పథకం ద్వారా సహకారం అందించాలన్నారు. జిల్లాలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం ద్వారా రైతులకు లబ్ధిచేకూరేలా అమలు చేయాలన్నారు. పండ్లతోటలు, కూరగాయలు, ఆధునిక సాగుపద్ధతులు, కోల్డ్‌స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లు తదితర వంటి సదుపాయాలను సమర్థవంతంగా అందించాలన్నారు. తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులకై రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లపై ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్‌భాష, డీపీవో సక్రియానాయక్, పరిశ్రమల శాఖ జీఎం రామలింగేశ్వర్‌గౌడ్, కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు, పుష్పమ్మ ఏడీఏ సంగీతలక్ష్మీ, ఫారెస్ట్‌అధికారి వెంకటేశ్వర్లు, మోహన్, ఏవోలు, ఏఈవోలుపాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారులతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా, డీఏపీ, పొటాష్ వంటి కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అవసరమైన ఎరువులను వ్యవసాయ రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా పొందాలన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల, బొంకూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలోను ఎంఈఓ రామకృష్ణ గురువాం పరిశీలించారు. కలుగోట్ల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ముఖ గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎస్‌ఓ పరిమళకు సూచించారు. విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ పాటించాలన్నారు. బొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని తెలపడంతో త్వరలో ఉపాధ్యాయులను నియమిస్తామని ఎంఈఓ రామకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలుగోట్ల కేజీబీవీలో మాట్లాడుతున్న ఎంఈఓ రామకృష్ణ

పెండింగ్ డీఏను విడుదల చేయాలి

ధరూరు: పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా రేవులపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏ అమలు చేయడం లేదని మండిపడ్డారు. రెండు డీఏలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక డీఏ విడుదల చేయడం అన్యాయమన్నారు. అదే విధంగా మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలను విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, ప్రభాకర్, వెంకట కృష్ణ, రాజానందం, హరిబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రేవులపల్లిలో డీటీఎఫ్ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్య

అలంపూర్: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యనందిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి హృదయరాజు అన్నారు. ఇందులో భాగంగా కళాశాలల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ ఇయర్ మొదటి ఏడాది నుంచే ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, మెయిన్స్, నీట్, సీఏ ఇతర పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, రాముడు, రామచంద్రయ్య, రఘువీర్‌కుమార్, సుధారాణి, వెంకటరాణి, మల్లయ్య, పూర్ణిమ, అభిజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న హృదయరాజు

కార్యదర్శిపై చర్యకు కలెక్టర్‌కు వినతి

గద్వాల: రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారులకు చెందెట్టు చేసిన గట్టు పంచాయతీ కార్యదర్శి కురుమన్నపై చర్యలు తీసుకోవాలని గట్టు గ్రామ ప్రజలు గురువారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. గట్టు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, రోడ్డు, బస్టాండ్‌కు సంబంధించిన స్థలాన్ని అక్రమించి నిర్మాణం చేపట్టిన వారిపై న్యాయ స్థానంలో రిట్ దాఖలు చేయగా, తప్పుడు పత్రాలు సమర్పించి రిట్ రద్దుపరిచి రూ.2 కోట్ల విలువైన ఆస్తిని ఆక్రమణదారులకు చెందెటట్టు చేసినట్లు ఆరోపించారు. పలువురు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోకారమయ్య వేడుకలు



పుల్లూరులో పీర్లను దర్శించుకొంటున్న ఎమ్మెల్యే విజయుడు



షేకుపల్లిలో గోకారమయ్యకు కందూర్ చేస్తున్న భక్తులు

ఎర్రవల్లి: మండల పరిధిలో గోకారమయ్య పండుగ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని షేకుపల్లి, సాసనూలు, కారుపాకుల గ్రామాల్లో కుటుంబ సభ్యులతో గోకారమయ్య వద్దకు చేరుకొని గొర్రె పొట్టేళ్లతో కందూర్ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తరతరాలుగా పంట పొలాల్లో విత్తనాలు వేసిన తర్వాత వర్షాల రాక కోసం ఆనవాయితీగా పల్లెలో ప్రతిఏటా వైభవంగా జరుపుకొంటారు. గోకారమయ్య పండుగ అనంతరం వారంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పచ్చదనంతో కళకళలాడుతాయని మండల రైతుల నమ్మకం.

ఘనంగా పీర్ల జాతర

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో పీర్ల పండుగ ఘనంగా నిర్వహించారు. నదికి నిమర్జనానికి వెళ్తున్న తరుణంలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల నిమర్జనం నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో పీర్లను ఎమ్మెల్యే విజయుడు దర్శించుకొన్నారు. కలుగోట్ల గ్రామంలో పీర్లను ఊరేగించారు.



సాసనూలులో పూజలు చేస్తున్న భక్తులు